ఎల్ఆర్ఎస్ స్కీమ్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అనధికార లే ఔట్లలో ఇళ్లు నిర్మించుకున్న వారి నుండి క్రమబద్దీకరణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవి వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో అనధికార లే ఔట్లలో, ప్లాట్లలో ఎటువంటి అనుమతులు పొందకుండ నిర్మించిన ఇళ్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)లో 90 రోజుల పాటు అవకాశం కల్పించిందన్నారు. 30 జూన్ 2025 కి ముందు ఎవరైనా అనధికార లే ఔట్‌లో ప్లాట్లు, స్థలాలు కొనుగోలు చేసిన వారు ఎల్ఆర్ఎస్ వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకుని, పీనలైజేషన్ చార్జీలు, సంబంధిత స్థలమునకు 14 శాతం వాల్యూ ప్రకారం చార్జీలు చెల్లించి, సంబంధిత స్థలము క్రమబద్ధ కరించు కోవాలన్నారు.ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

స్మార్ట్‌గా విద్యుత్ షాక్

- ఇప్పటికే వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్ల బిగింపు
- త్వరలో గృహాలకూ వర్తింపు
- రీఛార్జి చేసుకుంటేనే కరెంట్..లేదంటే కట్!
- వినియోగదారులపై పెను భారం

ఎన్నికల్లో ఇచ్చిన మాట మీద నిలబడే నైజం కాదని సిఎం చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారని రైతాంగం విమర్శిస్తోంది. స్మార్ట్ మీటర్లు వద్దంటూ వైసిపి పాలనలో రాద్ధాంతం చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మాటమార్చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. స్మార్ట్‌మీటర్ల బిగింపుతో ఛార్జీల పెంపు భారంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి - రాజోలు

రాజోలులో ఫ్రూట్ జ్యూస్ షాపు యజమాని రాజుకు ఈ ఏడాది మార్చి వరకూ నెలకు రూ.1,800 నుంచి 1,900 వరకు విద్యుత్ బిల్లు వచ్చేది. స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత ఏప్రిల్‌లో రూ.2,733, మేలో రూ.3,922, జూన్‌లో రూ.4,106, జులైలో రూ.4,908 బిల్లు వచ్చింది. చిన్న షాపు నడుపుకుంటున్న తనకు ఇంత బిల్లులు వస్తే ఎలా బతుకుతామని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజోలులో సిడి రికార్డింగ్ షాపు నడుపుతున్న నరేష్ షాపునకు ఫిబ్రవరిలో రూ.688 బిల్లు వచ్చింది. స్మార్ట్ మీటరు పెట్టాక మేలో రూ.1,260 జూన్‌లో 1,678, జులైలో రూ.1,541 బిల్లు వచ్చింది.

ముందుగా 1.70 లక్షల స్మార్ట్ మీటర్లు

రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా మొదలైంది. వీటిని తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సర్వీసులను ఏర్పాటు చేశారు. 1.70 లక్షల మీటర్లు టార్గెట్‌గా తీసుకుని పని ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 10,338 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా.. ఇప్పటి వరకూ 9,756 కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను అమర్చారు. వాణిజ్య సర్వీసులు 63704 ఉండగా ఇప్పటి వరకు 54,389 స్మార్ట్ మీటర్లను అమర్చారు. ఆ తరువాత 300 యునిట్లు దాటిన గృహ వినియోగదారులకు అమర్చేందుకు అదాని సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. గృహ వినియోగదారుల్లో 300 యూనిట్లు పైబడిన వారికి మాత్రమే స్మార్ట్ మీటర్లు తొలుత అమర్చుతామని వారు చెప్పున్నారు.

పేద, ధనిక, వ్యాపారస్తులు అనే తేడా లేకుండా అందరిపైనా స్మార్ట్ మీటర్లు పేరుతో విద్యుత్ భారాలు పడనున్నాయి. జిల్లాలో వాణిజ్య వినియోగదారులు (కమర్షియల్) 63,704మంది, గృహ వినియోగదారులు (డొమెస్టిక్), 6,32,925 మంది ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారు. వీటిని ఏర్పాటు చేసే కాంట్రాక్టును అదాని సంస్థకు కేంద్రం కట్టబెట్టింది. ఒక్కో స్మార్ట్ మీటరుకు రూ.12వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిసింది. జిల్లాలో మొదటి విడతగా ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో పూర్తయ్యాక రెండో విడతగా పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు బిగించే ప్రక్రియను చేపడతారు. ఆ తరువాత మూడోవిడతగా గహాలకు స్మార్ట్ మీటర్లు పెట్టనున్నారు.

రీఛార్జి లేదంటే సరఫరా కట్

స్మార్ట్ మీటర్లను వినియోగించుకుంటే నిత్యం వాడే సెల్‌ఫోన్‌లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జి చేయాల్సి ఉంటుంది. రీఛార్జి చేసుకోకపోయినా, మరచిపోయినా కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జి చేయాలంటే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తు తం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెల 10 నుంచి 15 రోజుల వ్యవధిలో బిల్లు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్లు వచ్చాక అది కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తుందో గగనటం అంచనా వేసి ఆ మొత్తాన్ని ముందుగానే చెల్లించి మీటరును రీఛార్జి చేసుకోవాలసి ఉంటుంది. ఒకసారి అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే.. మొత్తం ముందుగానే అయిపోతుంది. అటువంటి సమయంలో వినియోగదారు లు మొబైలుకు మేసేజ్ పంపిస్తారు. దాని ప్రకారం రీఛార్జ్ చేసుకోవాల్సి ఉందని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఇ రాజేశ్వరి తెలిపారు.

త్వరలో గృహాలకూ బిగింపు

స్మార్ట్ మీటర్లను ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాల్లో ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి దాకా ఉన్న పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నారు. స్మార్ట్ మీటర్లను గృహాలకు ఆపై రైతుల వ్యవసాయ మోటార్లకు వీటిని అమర్చనున్నారు. రైతులు వారి మోటార్ హెచ్‌పిని బట్టి ముందుగానే డబ్బులు రీఛార్జి చేసుకోవాలి. డబ్బులు చెల్లించకపోతే ఆటోమేటిక్‌గా కరెంట్ డిస్‌కనెక్ట్ అవుతుంది.

బిల్లు చెల్లింపులో వెసులుబాటు ఉండదు

ప్రస్తుతం అమలులో ఉన్న పోస్ట్ పెయిడ్ విధానంతో విద్యుత్ బిల్లు చెల్లించడానికి 15 రోజుల వరకు ఉండేది. స్మార్ట్ మీటర్ విధానంలో ఈ అవకాశం ఉండదు. సెల్‌ఫోన్ రీఛార్జ్ మాదిరి ముందే విద్యుత్ బిల్లు చెల్లించాలి. లేకపోతే వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. ఈ విధానం వలన పరిశ్రమలు, వ్యాపారులకు పెట్టుబడి భారమవు తుంది. చిన్న పరిశ్రమల నిర్వహణకు ఇది మరో గుదిబండ. సమాచారం ఉండదు..

ప్రభుత్వం పునరాలోచించాలి

అందరికీ స్మార్ట్‌మీటర్లు బిగింపు కార్యక్రమం పూర్తికాలేదు. అందరికీ ఈ మీటర్లు బిగింపు పూర్తయిన తరువాత ఈ మీటర్ల అసలు పని ప్రారంభమవుతుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈ కార్యక్రమం జరుగుతోంది. తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని వ్యతిరేకించాయి.మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంపై పునరాలోచించి ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలి.

-కారెం వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్

ఉన్నట్టుండి కరెంట్ పోతే ఎలా?

మొబైల్ ఫోన్‌కు లాగే ముందుగా ఎంత రీఛార్జి చేసుకుంటే అంత వరకే కరెంట్ ఇవ్వడం ఆపై కట్ చేయడం చేస్తే ఎవరికైనా ఇబ్బందే కదా. ఒక్కో నెలలో దుకాణంలో వ్యాపా రం తగ్గుముఖం పడితే డబ్బులున్నప్పుడు పెనాల్టీ కట్టి అయినా కరెంట్ బిల్లు కట్టే వెసులుబాటు ఉండేది. కానీ ఇప్పుడు ముందుగానే కట్టాలంటే కుదిరేదేనా. ఉన్నట్టుండి కరెంట్ పోతే పనులెలా జరుగుతాయి.

-లక్కింశెట్టి మణికంఠ, కిరాణా షాప్,యజమాని,శివకోడు

వంతెనకు ఇరువైపులా సుందరీకరించాలి

ఈదరపల్లి వంతెన పనులపై
కలెక్టర్ మహేష్ కుమార్ సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ఈదరపల్లి వంతెనకు ఇరు వైపులా పురపాలక సంఘం, అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సమన్వయంతో సులభతరంగా రాక పోకలు సాగించే విధంగా సుందరీకరించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం పురపాలక రహదారులు భవనాల శాఖ ఎపి ఇపిడిసిఎల్ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి ఇటీవల నూతనంగా నిర్మించిన ఈదరపల్లి వంతెన ఎగువ దిగువ సుందరీకరణ పనుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తూ వంతెన సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. వంతెనకు ఇరువైపులా అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ఎపి ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాజేశ్వరిని ఆదేశించారు. రహదారులు భవనాల శాఖ అధికారులు అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులపై ఫోకస్ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాము, స్థానిక పురపాలక సంఘ కమిషనర్ నిర్మల్ కుమార్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా

ప్రజాశక్తి - రాజోలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దేవవరప్రసాద్

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా విద్యుత్‌ను ఆదా చేసుకొని ఎస్‌సి, ఎస్‌టి గృహ వినియోగదారులు లబ్ధి పొందాలని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాజోలు మామిడికుదురు మండలాల పంచాయితీ కార్యదర్శులు, ఎలక్ట్రికల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకం కింద రెండు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ వ్యవస్థను 200 యూనిట్లు వినియోగించే ఎస్‌సి, ఎస్‌టి గృహ వినియోగదారులకు ఉచితంగా సోలర్ ప్యానల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా రాయితీ కల్పిస్తుందని దీనిని ఎస్‌సి, ఎస్‌టిల ప్రజలు సద్వినియోగం చేసుకొని మేలు పొందాలన్నారు. అలాగే సోలర్ ఫ్యానల్ అమర్చినందుకు ఒక్కో మీటర్కు నెలకు రూ.200 గృహ వినియోగదారుడు పొందవచ్చునన్నారు. విద్యుత్ ఆదా చేసేందుకు, విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు పిఎం సూర్యఘర్ పథకం ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా వెల్లడించారు. అలాగే పి-4 సర్వేలో బంగారు కుటుం బాలతో పాటు, మార్గ దర్శకుల ఎం పిక స్పష్టంగా ఉండాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామలలో పారిశుధ్యం సక్రమంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.కృష్ణమూర్తి, ఎపి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, వైస్ ఎంపిపిలు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరావు, రాజోలు తహశీల్దార్ భాస్కర్, రాజోలు, మామిడికుదురు ఎంపిడిఒలు వెంకటెశ్వ రరావు, ఎ.శ్రీనువాస్, రాజోలు నీటి సంఘం అధ్య క్షులు పినిశెట్టి బుజ్జి, మండల పరిషత్ సూపరిం టెండెంట్ సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

సూర్యనారాయణను సన్మానిస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల, ఛైర్‌పర్సన్ నూక రాణి

విధి నిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి - మండపేట

ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలు ప్రజలు ఎల్లప్పుడు గుర్తుంచుకుంటారని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, పుర పాలక సంఘం ఛైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి పేర్కొన్నారు. మండపేట పురపాలక సంఘం లో రిజర్వాయర్ వాచ్ మెన్ గా 33 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన రాబిల్లి సూర్యనారాయణ ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్ పిల్లి గణేష్, వేగుళ్ళ నారయ్య బాబు, కౌన్సిలర్లు పాల్గొని సూర్యనారాయణను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రావిడెంట్ ఫండ్ చెక్ ను అందజేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ టివి.రంగారావు, డిఇ కె.శ్రీనివాస్, ఎఇలు డి.పవన్, ఆర్.అనూష లక్ష్మి, అర్ఒ శాస్త్రి, జెఎఒ మూర్తి, టిపిఒ రమ్య , మైనార్టీ కో ఆప్షన్ సభ్యులు షేక్ ఇబ్రహీం, వైసిపి, టిడిపి కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎయిడ్స్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - అమలాపురం

సమావేశంలో పాల్గొన్న అధికారులు

జిల్లాలో హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పథక సంచాలకులు డాక్టర్ కె.నీలకంఠారెడ్డి వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ కమిటీ సమా వేశం డిఆర్ఒ రాజకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పథక సంచాలకులు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ చట్టం 2017 హెచ్ఐవి తో బాధపడే వారికి రక్షణ కవచం అన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలన దిశగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రత్యేక చొరవ తీసు కోవాలన్నారు. జిల్లాను ఎయిడ్స్ నియంత్రణ చర్యలలో ముందంజలో నిలపాలని సూచించారు. అందుబా టులో ఉన్న సౌకర్యాలతో మెరుగైన సేవలు అందిస్తూ వ్యాధి నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. డిఆర్ఒ రాజకుమారి మాట్లాడుతూ ఏ ఆర్ టి కేంద్రాలలో జీవితకాలం మందులను ఉచితంగా అందిస్తారని మందులు క్రమం తప్పకుండా వాడించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు అలాగే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వ్యాయామం క్రీడల ద్వారా ఆరోగ్యమైన జీవనాన్ని పొందే విధానంపై అవగాహన పెంపొందించా లన్నారు. ప్రతి ఐసిటిసి కేంద్రాలలో హెచ్ఐవి పరీక్షతోపాటు తగిన సూచనలు సలహాలు ఉచిత సేవలకు సంబం ధించిన సమాచారాన్ని బాధిత రోగులకు అందిం చాలన్నారు. అదనపు ప్రాజెక్టు సంచాలకులు కామేశ్వర ప్రసాద్ జిల్లాకు సంబంధించి వివిధ పారామీటర్ల వారీగా నియంత్రణ చర్యల పురోగ తిని సిబ్బంది ద్వారా సమీ క్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సలీం బాషా మా ట్లాడుతూ యుక్త వయసు నుండే హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ చర్యల పట్ల పూర్తి అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ దుర్గారావు దొర, డిసిహెచ్ఎస్.కార్తీక్, అదనపు డిఎంహెచ్ఒ, జిల్లా ఎయిడ్స్ నియం త్రణ అధికారిని సిహెచ్ వి.భరత లక్ష్మి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్


ఉద్యోగులను సత్కరించిన గున్నేపల్లి అగ్రహారం సర్పంచ్

అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం గ్రామ సచివాలయంలో పని చేసిన ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని ఆ గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు కొనియాడారు. గున్నేపల్లి అగ్రహారం గ్రామ సచివాలయంలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా వేరు వేరు ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను బుధవారం స్థానిక గ్రామ సచివాలయ ంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు ఆధ్వర్యంలో ఉద్యోగులకు దుశ్శాలు వాలు కప్పి పూలమాలలతో ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, సచివాలయ కార్యదర్శి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం

ప్రజాశక్తి - ఆలమూరు

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ మీనా

రైతులు తమ పంట సాగులో భూ మట్టి పరీక్షల ఆధారంగానే ఎరువుల వాడకం ఉండాలని వ్యవసాయ అధికారిని బి.మీనా, సర్పంచ్ సంగీత సుభాష్ అన్నారు. మండలంలోని పినపల్లలో రైతులకు పొలం బడిలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ సుభాష్ అధ్యక్షతన బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఏవో మీనా మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ సాగు చేసుకోవాలన్నారు. అలాగే రైతులు తమ సాగుకు జీవన ఎరువులు అయినా పాస్ఫో బ్యాక్టీరియా, పోటాస్ రిలీజింగ్ బ్యాక్టీరియా, వంటి వాటిని ఎలా వాడాలో వివరించారు. ఈ ఎరువులు అన్ని రకాల పంటలకు ఉపయోగపడతాయన్నారు. ఈ జీవన ఎరువులను పంటల సాగుకు, విత్తన శుద్ధికి ఎంతెంత మోతాదులో వాడాలో వివరించారు. డ్రిప్ ఇరిగేషన్ పైన అవగాహన కల్పించారు. అలాగే సర్పంచ్ సుభాష్ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట దుబ్బు దశలో ఉందని, రసాయన ఎరువులు ఎక్కువగా వాడొద్దన్నారు. ముఖ్యంగా యూరియా వాడకం పంట సాగులో తగ్గించుకోవాలని సూచించారు. యూరియా వాడకం వల్ల పంటలకు తెగుళ్ళ సోకి, క్రిమి కీటకాదులు వద్ధి చెంది పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ నానో ఎరువుల వాడకంపై వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తప్పకుండా తీసుకోవాలన్నారు. అలాగే మందుల పిచికారి చేసేటప్పు డ్రోన్ల విధానం మేలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వి.లక్ష్మణరావు, నీటి సంఘం డైరెక్టర్ రామారావు, గ్రామ వ్యవసాయ అధికారులు మధుసూదన్, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

ప్రసాదం తయారీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

లడ్డూ తయారీ పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

వాడపల్లి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం లడ్డూ తయారీని, అన్న ప్రసాదం తయారీ, పులిహోర ప్రసాదాల తయారీ, ఆర్వో వాటర్ ప్లాంట్ తదితర కేంద్రాలను ఉభయ గోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జివిబి నందాజీ, జిల్లా ఫుడ్స్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వై.రామయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా. ప్రసాదాల తయారీ కేంద్రాన్ని, అన్న ప్రసాదం కేంద్రాలను సందర్శించారు. అనంతరం ప్రసాదాల తయారీ పట్ల, అక్కడ ఉన్న సౌకర్యాల పట్ల పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మండలంలోని ర్యాలి గ్రామంలో వెలసిన స్వయంభు పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వార్ల ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించేందుకు హైదరాబాదుకు చెందిన విష్ణుభట్ల నాగ కృష్ణ శ్రీనివాస్ ఉదయభారతి దంపతులు బుధవారం రూ.10,116 ఆలయ కార్య నిర్వహణ అధికారి భాగవతుల వెంకటరమణమూర్తికి అందజేశారు వీరికి స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు.

నేడు సాయికృష్ణ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - అంబాజీపేట

గుత్తుల సాయికృష్ణ

అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం సబార్డినేట్‌గా పనిచేస్తున్న గుత్తుల సాయికృష్ణ నేడు ఉద్యోగ విరమణ చేయనున్నారు. మూడు దశాబ్దాల పాటు ఆయన వివిధ ప్రభుత్వం కార్యాలయాల్లో పనిచేశారు. 1984లో తొలుత పి.గన్నవరంలో ఆయన అటెండర్‌గా విధుల్లో చేరారు. 1991 నుంచి 2020 వరకూ అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో, 2020లో కొత్తపేట పంచాయతీ రాజ్ సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు.. అనంతరం 2021లో తిరిగి అంబా జీపేట మండల పరిషత్ కార్యాలయంలో సబ్ ఆర్డి నేటర్‌గా బాధ్యతలు స్వీకరిం చారు. మూడు దశాబ్దాలకు పైగా ఆయన సేవలందిం చారు. నిబద్ధతగా పనిచేసి పలువురి అధికారులు మన్ననలు పొందారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు.

పథకాలను పారదర్శకంగా అమలుచేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని సమగ్ర శిక్షా జిల్లా కో ఆర్డినేటర్ జి.మమ్మీ అన్నారు. అనాతవరం, నగర పంచాయతీ పరిధిలోని బాలుర ఉన్నత పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆరో తరగతి, పదో తరగతి విద్యార్థుల నోటు పుస్తకాలను, విద్యా మిత్ర కిట్లను పరిశీలించారు. ఆనంతరం పాఠశాలల్లో జరుగుతున్న పిఎం శ్రీ పనులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సిఎంఒ కె.సుబ్రమణ్యం, ఎంఇఒ ఆర్.ఉదయ భాస్కర్ లతో పాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కె.గంగవరం యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా 'ఆదర్శ ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయుడు' అవార్డు స్వీకరించిన ఉపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావుని బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు పితాని శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. సభలో ప్రాథమిక విభాగ ప్రధానోపాధ్యాయుడు పిఎస్ఎన్.మూర్తి, యుటిఎఫ్ సీనియర్ నాయకుడు దాసరి శ్రీను, ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, శ్రీధర్, ఏడుకొండలు, హిందీ ఉపాధ్యాయిని అయ్యంగారి లక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొని ప్రసంగించారు. వెంకటేశ్వరరావు నాయకత్వంలో పాఠశాల రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనల్లో రెండుసార్లు ఎంపికైంది. షైనింగ్ స్టార్ అవార్డు, అత్యధిక విజయాలు సాధించడంతో పాఠశాలకు గౌరవం తెచ్చారునీ విద్యార్థుల సర్వతోముఖాబివృద్ధికి ఆయన చేపట్టిన విశిష్ట కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో సైన్స ఉపాధ్యాయులు జివిఎస్.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌కు కేక్ తినిపిస్తున సతీష్‌కుమార్

ఘనంగా ఛైర్మన్ ప్రవీణ్ కుమార్ పుట్టినరోజు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు బుధవారం వైసిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో అభిమానులు కార్యకర్తలు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను ప్రవీణ్ కుమార్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో పి.గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు పెన్మెత్మ చిట్టిరాజు, నగర పంచాయతీ వైస్ ఛైర్ పర్సన్స్ రెడ్డి హేమ సుందరి, రెడ్డి శివన్నారాయణ, వేటుకూరి బోసురాజు, పార్టీ పట్టణ అధ్యక్షులు బొంతు సత్య శ్రీనివాస్, కౌన్సిలర్లు గంజా శ్రీనివాస్, కాంగ్రేగుల త్రిమూర్తులు, పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేసేందుకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేసేందుకు చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ ఎల్.అనిత అన్నారు. మండలంలోని పెదపళ్ల పరిధిలో ఉన్న పశు వుల మకాంలో వీధి కుక్కలు గేదె దూడలపై దాడి చేసిన ఘటనపై పశుసంవర్ధక శాఖ అధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అలాగే పశువైద్యులు డాక్టర్ భాను ప్రసాదరావు గేదె దూడలను పరిశీలించి తగిన వైద్య సహాయం అందించారు. పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ అనిత పెదపళ్ల పంచాయతీ కార్యాలయంలో ఈ అంశంపై మాట్లాడుతూ త్వరలో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టను న్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిర్వహించేలా అమలాపురంలో మరో 15 రోజుల్లో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రానుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.వేణి, రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ ఎడి అనిత

నేరాలు ఘోరాలు

భార్యను చంపిన భర్త అరెస్టు

ప్రజాశక్తి - రాజానగరం

భార్యను అతికిరాతకంగా హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డిఎస్‌పి వై.శ్రీకాంత్ వెల్లడించారు. నర్సీపట్నం మండలం గిడుగురుకు చెందిన వేమిరెడ్డి మాణిక్యానికి కొంతమూరుకు చెందిన ఉషారాణితో పెద్దల సమక్షంలో వివాహం అయింది. వీరికి తొమ్మిదేళ్ళ కుమారుడు నిహంత్, ఏడేళ్ళ కుమార్తె నస్సీ ఉన్నారు. కొంతమూరులో ఆమె తల్లి నల్లమాటి లక్ష్మి నివాసం ఉంటున్న ప్రక్క వీధిలో వీరు జీవిస్తున్నారు. ఇద్దరి మధ్య కొన్ని రోజులకు మనస్పర్థలు వచ్చి తరుచూ గొడవలు పడుతున్నారు. దీంతా నెలరోజుల క్రితం పోలీసు స్టేషన్‌లో భర్త మాణిక్యంపై భార్య ఉషారాణి ఫిర్యాదు చేసింది. అప్పటి నుండి భర్త ఇంటికి రాకుండా బయట తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ రాత్రి మాణిక్యం ఇంటికి వచ్చి ఉషారాణితో గొడవ పడి నాపరాయితో ముఖంపై బలంగా కొట్టడంతో భయపడిన వారి పిల్లలు పక్క వీధిలో ఉంటున్న అమ్మమ్మ ఇంటికి పరుగులు తీశారు. అమ్మమ్మకు జరిగిన విషయం చెప్పడంతో ఆమె సంఘటనా ప్రాంతానికి చేరుకుని రక్తపు మడుగులో ఉన్న కుమార్తెను చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించింది. చికిత్స పొందుతూ ఆరోగ్యం రాత్రి ఆరోగ్యం విషమించి మృతి చెందింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే అప్పటి నుంచి పరారీలో ఉన్న భర్తమాణిక్యంను బుధవారం కొంతమూరు బ్రిడ్జి వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు డిఎస్పీ తెలిపారు. కేవలం రెండు రోజుల్లో నిందితుడిని అరెస్టు చేసిన సిఐ ప్రసన్నవీరయ్యగౌడ్, ఎస్ఐ కెవి.నాగార్జున, హెడ్ కానిస్టేబుల్ సురేష్‌బాబు, రాంప్రసాద్, కానిస్టేబుల్ ఆశోక్‌లను ఆయన అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. రాజమహేంద్రవరం కోటిలింగాల పేటలో నివాసం ఉంటున్న బత్తుల చిట్టిరాజు(50) కోరుకొండ మండలం గుమ్మళ్ళదొడ్డిలో ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగానికి ప్రతి రోజు మోటారు సైకిల్‌పై వెళుతుంటాడు. ఇందులోభాగంగానే బుధవారం విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న అతనిని కొంతమూరు వద్ద టిప్పర్ లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

2.5 కేజీల గంజాయి పట్టివేత
ఐదుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నల్గొండ గ్రామ శివారులో 2.57 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను నార్త్ జోన్ డిఎస్‌పి శ్రీకాంత్ వెల్లడించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో బుధవారం నల్గొండ గ్రామ శివారు మామిడి తోట వద్ద నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను స్వాధీనం చేసుకుని వారి వద్ద ఉన్న 2.57 కేజీల గంజాయి, ఒక మోటార్ సైకిల్, రూ.1500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులంతా నల్లగొండ గ్రామానికి చెందిన చింతల గంగరాజు(29), బందారు అప్పన్నదొర(50), బొల్లిపూడి గ్రామానికి చెందిన పోలిన సాయినిఖిల్ (19), రాజానగరం మండలం తొర్రేడు గ్రామానికి చెందిన తాటిపాక గణేష్(20), కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన నేరుమల్లి అఖిల్(21)గా గుర్తించినట్లు తెలిపారు. వీరు ఒడిస్సా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ డి.రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుని మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చిన్నకొండేపూడిలో ఒక భవనానికి పెయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందకు పడి ఒక కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగవరం గ్రామానికి చెందిన అల్లం సత్యనారాయణ(46) చినకొండేపూడి గ్రామానికి చెందిన లేళ్ళ తిరుపతిరావు నూతన భవనానికి పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. బుధవారం ఉదయం యథావిధిగా పని ప్రదేశానికి చేరుకుని పెయింటింగ్ పని ప్రారంభించాడు. పని చేసే క్రమంలో ఆ కార్మికుడు భవనం పై నుంచి కిందకు పడిపోయాడు. ఇంటి యజమాని ఉదయం ఏడు గంటలకు కుటుంబ సభ్యులకు తెలియచేయగా, వారు సంఘటనా ప్రాంతానికి చేరుకుని రాజమహేంద్రవరంలో ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆ కార్మికుడు మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. మృతుడు భార్య అల్లం దేవీభవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంకుమార్ వెల్లడించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం జిజిహెచ్‌కు తరలించారు.

దాడి కేసులో నిందితునికి జైలు

ప్రజాశక్తి - కడియం

మాధవరాయుడుపాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్‌లో 2024 సంవత్సరంలో జరిగిన దాడి కేసులో నిందితునికి న్యాయమూర్తి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు సిఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం..మాధవరాయుడుపాలెం చైతన్య నగరకు చెందిన నిందితుడు ముంజేటి సురేష్ మద్యం మత్తులో డ్రింక్ సీసాతో అదే గ్రామానికి చెందిన బొల్ల ధనయ్యపై దాడి చేశాడు. గాయపడ్డ ధనయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ టి.కృష్ణాజీ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి రాజమహేంద్రవరం 8 వ అదనపు జిల్లా కోర్టులో వాదోపవాదాలు జరగగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా ఏడేళ్ళ జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

హైస్కూల్ వాచ్‌మెన్‌లకు వేతనాలు చెల్లించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రభుత్వ హైస్కూల్లో పనిచేస్తున్న నైట్ వాచ్మెన్ లకు మార్చి నుంచి బకాయి వేతనాలు చెల్లించడం లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చెందారు. ఆయన బుధవారం సమావేశంలో మాట్లాడుతూ గత 5 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే కార్మికులు ఏమి తిని పనిచేయాలని ప్రభుత్వాన్ని విమర్శించారు. నైట్ వాచ్‌మెన్‌లను పగల పూట కూడా స్కూలు వద్ద ఉండాలని ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి తీసుకొస్తున్నారని 30 రోజుల పద్ధతి కాదని విమర్శించారు. వీరికి నెలకు రూ.6 వేలు జీతం మాత్రమే ఇస్తున్నారన్నారు. రూ.6 వేలకు పగలు రాత్రి పనిచేయాల్సి వస్తోందన్నారు. గతంలో ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం జరగలేదని అన్నారు. నైట్‌వాచ్‌మెన్ నైట్ మాత్రమే ఉపయోగించుకోవాలని, పగల వారికి పని చెప్ప కూడదని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .అమలాపురం సిఐటియు ఆఫీస్ వద్ద అంబేద్కర్ కోనసీమ జిల్లా నైట్ వాచ్మెన్ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జె.దుర్గాప్రసాద్ పాల్గొని వారికి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలోరాంబాబు, మురళీకృష్ణ, కె.సత్యం, సత్యనారాయణ శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - అంబాజీపేట

మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సుబ్బారావు ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం 30 మండి ఉద్యోగులతో ప్లాస్టిక్ నిషేధంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అంబాజీపేట సెంటర్‌లో 230 షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. మిగిలిన షాపులకు గురువారం నోటీసులు జారీ చేస్తామని డిప్యూటీ ఎంపిడిఒ కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కెవిలి. సత్యనారాయణ తెలిపారు. వ్యాపార వర్గాలు ప్లాస్టిక్ కవర్లు వినియోగం నిలిపి వేసి పర్యావరణ కలుషితం కాకుండా సహకరించాలని అవగాహన కల్పిస్తూ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోషిణికి అవార్డు ప్రదానం చేస్తున్న దళిత చైతన్య వేదిక నాయకులు తదితరులు

రోషిణికి అంబేద్కర్ విద్యా కుసుమాల అవార్డు

ప్రజాశక్తి - మామిడికుదురు

ఫార్మసీలో డాక్టర్ కోర్సును పూర్తి చేసిన ఉప్పే వేణుగోపాల్ పద్మ దంపతుల కుమార్తె డాక్టర్ ఉప్పే రోషిణికి ఏపి రాష్ట్ర దళిత చైతన్య వేదిక అంబేద్కర్ విద్యా కుసుమాల అవార్డును ప్రదానం చేసింది. పాశర్లపూడి బాడవలో అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో దళిత చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలకపాటి శ్రీధర్ అధ్యక్షతన మంగళవారం రాత్రి ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఫార్మసీలో డాక్టర్ కోర్స్ పూర్తి చేసిన రోషిణికి చైతన్య వేదిక నాయకులు పూలమాలలు వేసి శాలువాకప్పి నీలి కీర్తి కిరీటం తో బత్తుల మురళీకృష్ణ, రాజోలు వైస్ ఎంపిపి పాలాది మాణిక్యాలు శాంతారాం అవార్డు ప్రదానం చేశారు. అనంతరం దళిత చైతన్య వేదిక నాయకులు మాట్లాడుతూ విద్యలో రాణిస్తున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత చైతన్య వేదిక నుండి అంబేద్కర్ విద్యా కుసుమాల అవార్డును ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ విద్యా కుసుమాల అవార్డును అందుకున్న డాక్టర్ ఉప్పే రోషిణి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరి అంబేద్కర్ ఇచ్చిన పే బ్యాక్ టు ద సొసైటీ నినాదాన్ని కొనసాగించాలన్నారు.. ఈ కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ పెంతా శ్రీనివాస్, వేదిక జిల్లా అధ్యక్షులు లిఖితపూడి బుజ్జి, వేదిక రాజోలు మండల అధ్యక్షులు మండపాటి మధు, సభ్యులు మేడబల శ్యాం శేఖర్, పొన్నమాటి భాస్కర్, గోగి మోహన్, ఉప్పే జగదీష్, ఉప్పుల మురళీకృష్ణ, ఉప్పే సత్యనారాయణ మాస్టర్, నైనాల కాశీ, ఉప్పే శ్రీను, విప్పర్తి శ్రీను, తిరుగుళ్ల ప్రసాద్, ఆదిమూర్తి పాల్గొన్నారు

గ్యాస్ సిలిండర్ పేలి ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని భీమ క్రాస్ పాలెం లో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలిన ఒకరికి తీవ్ర గయాలు అయ్యాయి.. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు అనిశెట్టి సుబ్బలక్ష్మి అనే మహిళ ఇంటిలో జరిగిన ఈ ప్రమాదంలో ఇంటిలోని వారు సురక్షితంగానే ఉండగా.. సాయం చేయడానికి వెళ్లిన పితాని చిన్నబాబుకు గాయాలపాలయ్యారు.. ఆయనను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. సిలిండర్ పేలుడు కారణంగా తీవ్ర భయానం చెందారు.

బైక్‌పై వచ్చి సెల్ ఫోన్ చోరీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నడిచి వెళ్తున్న వ్యక్తి నుంచి బుధవారం సెల్‌ఫోన్ లాక్కుని ఇద్దరు యువకులు బైక్‌పై పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింత బైపాస్ రోడ్డు పై కాకినాడకు చెందిన కట్టాం వెంకటేశ్వర రావు నడిచి వెళుతున్నాడు. ఈ సమయంలో ఇద్దరు యువకులు మోటార్ బైక్ పై వచ్చి పరారయ్యారు. నడిచి వెళ్తున్న వారి లేదు సెల్ ఫోన్ లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన మహిళ ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - గండేపల్లి

అదృశ్యమైన మహిళ ఆచూకీని పోలీసులు కనిపెట్టి కేసును ఛేదించారు. సింగరాయపాలెంకు చెందిన వివాహిత ఈ నెల 18 నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివ నాగబాబు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి వివాహితను హైదరాబాద్‌లో గుర్తించారు. అతి తక్కువ సమయంలో మహిళ ఆచూకీ కనిపెట్టిన పోలీసులను అభినందించారు

చెరువులో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేట తాగునీటి చెరువులో ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. బుధవారం చెరువులో మృతదేహం తేలుతూ కనిపించడంతో పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి స్థానిక టవర్ కాలనీకి చెందిన ఎల్లె జేమ్స్ రాజు (50)గా గుర్తించారు. రాజు పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నట్టు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్నాళ్ల కిందట జరిగిన బంగారు నగలు చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి 63 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. కెఎస్.పురానికి చెందిన గద్దం రామ్ నవీన్, నర్సీపట్నంకు చెందిన అలెక్సాలను అరెస్ట్ చేశామని ఎస్ఐ హరిబాబు తెలిపారు.

మృతుని కుటుంబానికి సాయం అందజేస్తున్న సర్పంచ్

స్వీపర్ కుటుంబానికి రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మసకపల్లి పంచాయతీలో 30 సంవత్సరాలుగా పంచాయతీ స్వీపర్‌గా పనిచేస్తున్న తాతపూడి కొండయ్య ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ, కార్యక్రమ ఖర్చులకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి గ్రామ సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ కళ్యాణ్ రూ.10 వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ర్యాలి గ్రామంలో బుధవారం ఉమ కమండలేశ్వర కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా జనసేన పార్టీ తరఫున మెర్ల నాగేశ్వరరావు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఛైర్మన్, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కరటూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

ప్రజాశక్తి - అమలాపురం

వడ్రంగి కార్మికులతో మంత్రి సుభాష్

రాష్ట్రంలో కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని, అలాగే వడ్రంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్(వడ్రంగి)అసోసియేషన్ 8వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవసభ అమలాపురం వాసర్ల గార్డెన్స్ లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వడ్రంగి మేస్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ఏ కార్మికుడికి కష్టం వచ్చినా నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని నిండు సభలోనే తన ఫోన్ నెంబర్ను కార్మికులకు ఇచ్చారు. ఈ సభకు రాష్ట్రం నలుమూలలనుండి, ఆయా జిల్లాల, మండలాల అధ్యక్షులు హాజరై నూతన అధ్యక్షుడి, కమిటీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకొని ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాటికొండ రంగబాబు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు గణాల సత్యనారాయణ ఎన్నికయ్యారు.

మెరుగైన పాలన అందిస్తాం

రామచంద్రపురం : ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరింతగా మెరుగైన సుపరిపాలన అందించే దిశగా ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం తాళ్లపొలం, ఉట్రుమిల్లి గ్రామాల్లో ప్రజల వద్దకు నేరుగా వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం వివరించారు. ప్రజల యొక్క అభిప్రాయాలు తెలుసుకుని మై టిడిపి యాప్ లో వివరాలు పొందుపరిచారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఆగస్టులో అన్నదాత సుఖీభవ, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీలు నెరవేర్చుతున్నామన్నారు. కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కాశినాడ రామారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్య వైఖరిపై నిరసన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ లో అనధికార లేఔట్లు, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల పై చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తున్నారని అధికార వైఎస్ఆర్ కౌన్సిలర్లు తీవ్రనిరసన వ్యక్తం చేశారు. కౌన్సిల్ హాలు నందు ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత ఎజెండాలోని అంశాలపై ఏ విధమైన చర్చ జరగకుండానే ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ మధ్య వాగ్వాదంతో అర్ధాంతరంగా ముగిసింది.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రావులపాలెం

సాయం అందిస్తున్న ఆత్మబంధు గ్రూప్

ఇటీవల రోడ్డు ప్రమా దంలో గాయపడిన పొత్తికాయలకి చెందిన అయ్యప్ప స్వామి ఆత్మబంధు గ్రూప్ సభ్యులు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. స్థానిక పొత్తికాయడం ఆకుల లోవరాజు ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న అయ్యప్పస్వామి ఆత్మబంధు గ్రూప్ సభ్యులు సేకరించిన రూ. 46 వేలు తోట శివగురు స్వామి చేతుల వారి సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, నాగిరెడ్డి, శ్రీనురెడ్డి, రాజు, మణికంఠ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ప్రజాశక్తి - కొత్తపేట

ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రతా పింఛన్లు అర్హులకు అందిస్తున్నామని ఎంపిడిఒ బండారు సత్యానందరావు అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో నూతనంగా 763 వితంతువు (స్పౌజ్) పింఛన్లు గాను రూ.3,052,000 మంజూరయ్యాయని అన్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో ఆగస్టు నుంచి కొత్తగా వితంతువు (స్పౌజ్) కేటగిరీలో 763 పింఛను మంజూరు అయినట్లు తెలిపారు. అలాగే రావులపాలెం మండలం నుంచి డయాలసిస్ పింఛన్ రూ.10 వేలు మంజూరైనట్లు ఎంపిడిఒ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేటలో శుక్రవారం 11 కెవి సమితి రోడ్, బోడిపాలెం ఫీడర్, కోర్ట్ ఫీడర్ నందు ట్రీ ట్రిమ్మింగ్, లైను మరమ్మతుల నిమిత్తం కొత్తపేట టౌన్ ఏరియా ,వాడపాలెం ఏరియా గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా లోఅంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కె రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు..

రామచంద్రపురం: శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 33 /11కెవి.రామచంద్రపురం టౌన్ సెక్షన్లో 11 కెవి టౌన్ -2 ఫీడర్ మీద చెట్లు కొమ్మలు తొలగించడం, (ట్రిమ్మింగ్), మెయింటెనెన్స్ వర్క్ చేయడం వంటి పనుల వల్ల మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాల రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల చిప్పిడిపాడు సావరం, గిరిజాల హాస్పిటల్, ఆదర్శ హాస్పిటల్, బ్రాడీపేట ముచ్చిమిల్లి రోడ్డు, రామం పుల్లరి ఏరియాలో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. 33/11కెవి ద్రాక్షారామ సబ్ స్టేషన్ లో ద్రాక్షారామ ఫీడర్ చోడవరం విలేజ్ విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగునని తెలిపారు.

మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యునిగా ఇబ్రహీం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - మండపేట

మండపేట మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో కో ఆప్షన్ సభ్యునిగా ఎన్నికైన షేక్ ఇబ్రహీం బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సిసి దంటు శ్రీనివాస్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్పర్సన్ పతివాడ రాణి, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, వైస్ ఛైర్మలు, వైసిపి కౌన్సిలర్ లు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వరప్రకాష్ తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాబు హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మి మోసపోయారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ ఆధ్వర్యంలో బుధవారం కూనవరం, గోపవరం, కిత్తన చెరువు గ్రామాలలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని డాక్టర్ శ్రీకాంత్ వైసిపి నాయకులు కార్యకర్తలతో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంచే బుల్లియ్య, ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయల్, జడ్‌పిటిసి గెడ్డం సంపదరావు, ఎంపిటిసిలు కొంకి ఏడుకొండలు, కాట్రు ధనలక్ష్మి వైసిపి రాష్ట్ర కార్యదర్శులు దంగేటి రాంబాబు, చెల్లుబోయిన శ్రీను, వైసిపి మండల కార్యదర్శి పినిపే జయరాజ్, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలికను మోసం చేసిన కరస్పాండెంట్‌ను శిక్షించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

బాలికను మోసం చేసిన సంఘటనలో మార్గదర్శి పాఠశాల కరెస్పాండెంట్ శిక్షించాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ డిమాండ్ చేశారు. రామచంద్రపురంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రాయవరం మండలానికి చెందిన మాచవరం గ్రామంలో జరిగిన ఈ ఘటన పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ అనే బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి, పాఠశాలలో చదువుతున్న బాలికను మోసం చేయడం పట్ల విద్యార్థి సమాజం ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. పోక్సో చట్టం ప్రకారం మార్గదర్శి స్కూల్ కరస్పాండెంట్ షేక్ జయరాజుని అరెస్టు చేసి శిక్షించాలని, ప్రభు త్వమే బాలిక కుటుంబానికి అన్ని విధాల ఆదుకోవాలన్నారు. మార్గదర్శి పాఠశాలను ఏడో తరగతి నుంచి పదో తరగతి వరకు గుర్తింపు లేకుండా నడిపిన కరస్పాండెంట్ పై క్రిమినల్ చర్యలు తీసుకుని పాఠశాల గుర్తింపుని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం కూడా ఈ ఘటనలో ఉందని, ఇంతకాలం గుర్తింపు లేకుండా నడుపుతున్న రాయవరం విద్యాశాఖ అధికారుల మార్గదర్శి పాఠశాల పై ఏ చర్యలు తీసుకున్నారని అధికారులను సిద్ధు ప్రశ్నించారు. విద్యాశాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE, KAKINADA
A.S.S.R. No.7982/2024

Between:
Shaik Hussain ...Appellant/ Defendant
And
Bugatha Rambabu (died) and others ...Respondents/ Plaintiffs

To:R2: Bugatha Vijaya, W/o. late Rambabu, Housewife, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.
R3: Bugatha Parvathi Lakshmi Vani, W/o. Panthadi Brahmanandam, Housewife, D.No. 18-15-4, Suryanarayanapuram, Kakinada.
R4: Bugatha Shiva Sankar, S/o. late Rambabu, Private Employee, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.
R5: Bugatha Udaya Bhaaskara Venkataramana, S/o. late Rambabu, Private Employee, D.No.18-15-4, Suryanarayanapuram, Kakinada.

పై నెంబరు పిటిషన్‌లో 2 to 5 రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక వదిలిపెట్టారు. పై కోర్టువారు పై హాజరు నిమిత్తం ది.01-08-2025 తేదికి వాయిదా వేయుచున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 గంటలకు పై కోర్టువారి సమక్షంలో స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములను తెలుపుకోవలెను. లేనిచో మీ పిటిషన్ పై మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
మేడపాటి రామారెడ్డి
అడ్వకేట్, డోనెం.23-7-7/1, దుర్గాలావారివీధి కాకినాడ, సెల్: 9059429999

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం, కె.ఏనుగుపల్లి కి చెందిన గాఢ సురేష్, తండ్రి: పెద్దిరాజు, డోర్ నెం. 2-183 లో నివాసముంటున్నాను. ది. 20-07-2025 తేదిన నేను పాస్‌పోర్టు నెం. U 1847474 ను జిరాక్స్ తీయించుకొనుటకు ఏనుగుపల్లి నుండి పి.గన్నవరం వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయినది. దయచేసి నా పాస్‌పోర్టు దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు పంప కోరుచున్నాను.

గాఢా సురేష్, తండ్రి: పెద్దిరాజు
డోర్ నెం.2-183, కె.ఏనుగుపల్లి,
పి.గన్నవరం మండలం
సెల్.8885915552

లింకు దస్తావేజు పోయినది

శ్రీమతి కుందుం సత్యవతి, W/o. కుందుం కరుణాకర్, డోర్ నెం. 46-5-12 ది, ఉప్పు వీధి, దానవాయిపేట, రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లాలో నివసిస్తున్న నా యొక్క ఒరిజినల్ లింక్ క్రయ దస్తావేజు నెం. 516/1973, Dt. 24-04-1973 రాజమండ్రి సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ కాబడిన దస్తావేజు ది. 26-7-2025 వ తేదీన నా ఇంటి దగ్గర నుంచి ప్రకాష్‌నగర్ నందు జిరాక్స్ నిమిత్తం వెళ్లుచుండగా రాజమండ్రి ప్రకాష్‌నగర్ రాంప్ రోడ్ పార్క్ వద్ద పడిపోయినది. ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

కుందుం సత్యవతి
సెల్: 9666091227

పాస్‌పోర్టు పడిపోయినది

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం, మూలస్థానం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి మాచరరావు, S/o. వీర వెంకట సత్యనారాయణ అను నేను 10-07-2025వ తేదీన నా పాస్‌పోర్టు నెంబరు Y3423246 ను జిరాక్స్ తీయటానికి ఆలమూరు బైక్‌పై జిరాక్స్ కోసం వెళుతున్న సమయంలో నా పాస్‌పోర్టు ఒరిజినల్ మార్గం మధ్యలో పడిపోయినది. నా పాస్‌పోర్టు కొరకు చుట్టుప్రక్కల అంతా వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల క్రింది అడ్రసుకు ఇవ్వగలరు.

పెద్దిరెడ్డి మాచరరావు,
S/o. వీర వెంకట సత్యనారాయణ
మూలస్థానం గ్రామం, ఆలమూరు మండలం
సెల్: 9381582022

ప్రకటన


కీ॥శే॥ మల్లాడి ధనరాజు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం, ఎస్.కొత్తపల్లి, పెద రావులపేట గ్రామం, డో.నెం. 7-78 కాపురస్తులు మల్లాడి నాగరాజు, S/o. ధనరాజు (లేటు), S/o.కన్నయ్య (లేటు) గారి కుమారుడు మల్లాడి నాగరాజు ఇచ్చిన పత్రికా ప్రకటన.

నా తండ్రి మల్లాడి ధనరాజు గారు ఎస్.కొత్తపల్లి పెద రావులపేటలో 10-11-2003 సంవత్సరంలో మరణించారు. వీరి మరణం ఎస్.కొత్తపల్లి గ్రామపంచాయతీ నందు నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్నచో ఏడు పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: మల్లాడి నాగరాజు
S/o. మల్లాడి ధనరాజు (లేటు)
డోనెం. 7-78, ఎస్.కొత్తపల్లి పెద రావులపేట
ఉప్పలగుప్తం మండలం, సెల్: 9959484273

వేలం ప్రకటన

మహారాజశ్రీ గౌరవనీయులైన రాజమహేంద్రవరం 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జీ గారి కోర్టులో

ఈ.పి. నెం. 39/2022
ఓ.యస్.నెం. 406/2012

Between:
దేవలంక పార్వతి పద్మారా ...డిక్రీ హోల్డర్
మరియు
దేవలంక బాలరోశన్‌కుమార్, (తండ్రి) (లేటు) సూర్యారావు, హిందువు, వయస్సు 44 సం॥లు, కేరాఫ్ డి.వి.సి. ఇంజనీరింగ్ కాలేజీ, పాలచర్ల, రాజానగరం మండలం, తూర్పుగోదావరి జిల్లా. ...జె.డి.ఆర్

పై నెంబరు డిక్రీ బకాయి జడ్జిమెంట్ డెటార్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి పై కోర్టు వారు సమక్షములో ది.13-08-2025 తేదిన ఉదయం 10.30 గంటల లగాయతు బహిరంగ వేలం జరుపబడును. ఆశక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చును. మిగతా వివరములను డిక్రీ హోల్డరు గారి అడ్వకేటు ఆఫీసు నందు గాని, పై కోర్టు నజరతు ఆఫీసు నందు గాని తెలియజేయబడును.

వేలం కాబడు షెడ్యూలు ఆస్తి వివరములు

తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామ పంచాయితీ

ఐటమ్ నెం. 1:
తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామం, నరేంద్రపురం గ్రామ పంచాయితీ పాత నెం.3-172 క్రొత్త డోర్ నెం.3-147 యందు గల చ.గ. 376.27 లు యందలి ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగ్ అందుకు హద్దులు:
తూర్పు: రోడ్డు, దక్షిణం: ఆదిమూలం వారి ఇల్లు, పడమర: యందలి ఐటమ్ నెం.2, ఉత్తరం: గొల్లకోటి సూర్యకాంతం గారి ఇల్లు.
నడుమ హద్దుల మధ్య గల చ.గ.376.27 లు లో అరిస్థిపట్టి 1/4వ వంతు భాగములు చెందిన ఖాళీ నివేశ్య స్థలము, అందు ఇల్లు మరియు మాములు ఈజిమెంటు హక్కులతో సహా.

ఐటమ్ నెం. 2:
తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, రాజానగరం సబ్-రిజిస్ట్రార్, నరేంద్రపురం గ్రామం, నరేంద్రపురం గ్రామ పంచాయితీ పాత నెం. 3-172 క్రొత్త డోర్ నెం. 3-147 యందు గల చ.గ. 123.72 లు యందలి ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగ్ అందుకు హద్దులు:
తూర్పు: యందలి ఐటమ్ నెం. 1, దక్షిణం: ఆదిమూలం వారి ఇల్లు, పడమర: దేవలంక వెంకట్రావు గారి ఇల్లు, ఉత్తరం: గొల్లకోటి సూర్యకాంతం గారి ఇల్లు.
నడుమ హద్దుల మధ్య గల చ.గ. 123.72 లు లో అరిస్థిపట్టి 1/4వ వంతు భాగములు చెందిన ఖాళీ నివేశ్య స్థలము, అందు ఇల్లు మరియు మాములు ఈజిమెంటు హక్కులతో సహా.

డిక్రీ హోల్డరు విలువ: రూ. 30,00,000/-
అమీనా కమీషన్ విలువ: రూ. 20,00,000/-
జె.డి.ఆర్. కమీషన్ విలువ: వివరిలేవు
మార్కెట్టు విలువ: రూ. 12,49,975/- లు నిర్ణయించబడినది.

యం.ఆర్ సత్యసాయి (రాంబాబు)
అడ్వకేట్, డోర్ నెంబరు. 86-11-11/1, వాడ్రేవు నగర్, తిలక్ రోడ్డు, రాజమహేంద్రవరం, సెల్: 9848376941